GV MALL
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 74 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/-
గురువారం 17 అక్టోబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# ఎంజీఆర్ నాకెప్పుడూ స్ఫూర్తి: పవన్ కళ్యాణ్

## ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నా డీఎంకే పార్టీకి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



అమరావతి,అక్టోబర్ 17 (రిపబ్లిక్ న్యూస్) : అన్నాడీఎంకే పార్టీకి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఎంజీ రామచంద్రన్ (ఎంజీఆర్) ఈ పార్టీని స్థాపించి తమిళనాడులో తిరుగులేని రాజకీయశక్తిగా ఎదిగారన్నారు. పేదలు, అన్నార్థులకు సాయం చేశారని.. వారికి హుందాగా జీవించే హక్కును కల్పించారని కొనియాడారు. ఆయన పాలనలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమానంగా చేపట్టారని.. తమిళనాడును దేశంలో సుసంపన్న రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు."ప్రజల వర్తమాన అవసరాలను తీర్చడంతో పాటు దీర్ఘకాలిక భవిష్యత్తు, స్థిరాభివృద్ధికోసం ఎంజీఆర్ గొప్ప పునాది వేశారు. ప్రజలు, పాలన పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధిని చూసి నేను స్ఫూర్తి పొందా. ఎంజీఆర్ తర్వాత ఆయన ఆశయాలు, నాయకత్వాన్ని జయలలిత విజయవంతంగా కొనసాగించారు. ఎంజీఆర్ ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లి ప్రజల చేత 'అమ్మ'గా గౌరవాన్ని అందుకున్నారు. పళనిస్వామి నేతృత్వంలో అన్నాడీఎంకే.. ఎంజీఆర్ విలువల్ని ముందుకు తీసుకెళ్లాలి. ఎన్నో సవాళ్లు ఎదురైనా ఆ పార్టీ తమిళనాడు ప్రజల గొంతుకగా ఉంది. ఇదంతా ఆ పార్టీ విలువల వల్లే సాధ్యమైంది" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# గుజరాత్ కు ఒక నీతి, తెలంగాణకు ఒక నీతా?: హరీశ్ రావు

## తెలంగాణ రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ వివక్ష చూపుతోందని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్రవు విమర్శించారు.



హైదరాబాద్,అక్టోబర్ 17 (రిపబ్లిక్ న్యూస్) : తెలంగాణ రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్రరావు విమర్శించారు. పత్తికి కేంద్రం చెల్లించే మద్దతు ధర ఒక్కో రాష్ట్రంలో ఒక్కోవిధంగా ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్లో ఆయన పోస్ట్ చేశారు."ఒకే దేశం-ఒకే పన్ను, ఒకే దేశం- ఒకే ఎన్నిక, ఒకే దేశం- ఒకే రేషన్" అంటూ ఊదరగొట్టే కేంద్ర ప్రభుత్వం.. ఒకే దేశం- ఒకే కనీస మద్దతు ధర ఎందుకు ఇవ్వడం లేదు. నాణ్యమైన పత్తిని పండిస్తున్న తెలంగాణ రైతు పట్ల ఎందుకీ వివక్ష? గుజరాత్ పత్తికి మద్దతు ధరగా క్వింటాకు రూ.8,257 చెల్లిస్తున్న కేంద్రం.. తెలంగాణకు రూ.7.521 మాత్రమే ఇవ్వడం దుర్మార్గం. గుజరాత్కు ఒక నీతి, తెలంగాణకు ఒక నీతా?" అని హరీశ్రావు పేర్కొన్నారు.

# అయినను పోయి రావలె హస్తినకు: కేటీఆర్ ఎద్దేవా


**అయినను పోయి రావలె హస్తినకు అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.**



హైదరాబాద్,అమరావతి,అక్టోబర్ 17 (రిపబ్లిక్ న్యూస్) : 'అయినను పోయి రావలె హస్తిన'కు అని సీఎం రేవంత్రెడ్డిని ఉద్దేశించి భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎద్దేవా చేశారు. సీఎం దిల్లీ పర్యటనలపై ఆయన 'ఎక్స్'లో విమర్శలు చేశారు. "సీఎం రేవంత్రెడ్డి ఢిల్లీ పర్యటనలతో రాష్ట్రానికి రూపాయి లాభం లేదు. దిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలతో సిల్వర్ జూబ్లీ చేశారు. మూసీ, హైడ్రా పేరుతో పేదోళ్ల పొట్ట కొట్టారు. 420 హామీలను మడతపెట్టి మూలకు వేశారు. పండగలు లేవు.. ఆడబిడ్డలకు చీరలు అందలేదు. అవ్వాతాతలు అనుకున్న పింఛన్ లేదు. తులం బంగారం జాడే లేదు.. అయినను పోయి రావలె హస్తినకు" అని కేటీఆర్ పేర్కొన్నారు.

# ఏపీలో పెట్టుబడులకు ఇంతకంటే మంచి సమయం లేదు: సీఎం చంద్రబాబు

## పెట్టుబడిదారులకు ఏపీ స్వర్గధామం అని ఏపీ సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.



అక్టోబర్ 17 (రిపబ్లిక్ న్యూస్) :పెట్టుబడిదారులకు ఏపీ స్వర్గధామం అని ఏపీ సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. హరియాణా సీఎం నాయబ్ సింగ్ సైనీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రెడ్ కార్పెట్ ఆహ్వానమంటూ స్వాగతించారు. ఏపీ ఇప్పుడు కొత్త అత్యుత్తమ విధానాలతో ఆహ్వానం పలుకుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ పూర్తిగా వ్యాపార అనుకూల రాష్ట్రమని

చెప్పారు. కొత్త పాలసీ ఫ్రేమ్వర్క్లు పరిశ్రమ అనుభవజ్ఞులతో రూపొందించామన్నారు."వ్యవస్థాపక స్ఫూర్తి, వ్యాపారాలను పెంపొందించడమే లక్ష్యం. దేశంలో అత్యుత్తమ వ్యాపార పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తున్నాం. అభివృద్ధికి ఏపీ రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యతను తీసుకుంటుంది. దేశంలో, ఏపీలో పెట్టుబడులకు ఇంతకంటే మంచి సమయం లేదు. ఈ ఉత్తేజకరమైన వృద్ధి ప్రయాణంలో మాతో సహకరించండి. వ్యాపార పరిధులు, రాష్ట్ర సామర్థ్యం పరస్పరం విస్తరించుకునే అవకాశమిది. ఏపీలో నూతన పెట్టుబడులు కోసం ఎదురుచూస్తున్నాం" అని చంద్రబాబు తెలిపారు.

# 2024: మిస్ ఇండియాగా 2024 గా నిఖిత పోర్వాల్

## 2024: ఫెమినా మిస్ ఇండియా గా నిఖిత పోర్వాల్ కిరీటాన్ని దక్కించుకున్నారు.



అక్టోబర్ 17 (రిపబ్లిక్ న్యూస్) :ఈ ఏడాది ఫెమినా మిస్ ఇండియా కిరీటాన్ని నిఖిత పోర్వాల్ సొంతం చేసుకున్నారు. ముంబయిలోని ఫేమస్ స్టూడియోస్లో జరిగిన ఈవెంట్లో మధ్యప్రదేశ్కు చెందిన నిఖిత విజయం సాధించారు. మిస్ వరల్డ్ పోటీల్లో భారత్ తరపున ఆమె ప్రాతినిధ్యం వహించనున్నారు. రేఖా పాండే, ఆయుశీ దోలకియా మొదటి, రెండవ రన్నరప్లుగా నిలిచారు. 60వ ఫెమీనా మిస్ ఇండియా పోటీల్లో భాగంగా 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన అందాల భామలు పోటీపడ్డారు. కేవలం తమ అందాలతోనే కాదు, ప్రతిభతోనూ జడ్జిల నుంచి ప్రశంసలు అందుకున్నారు. తుది పోరులో అదరగొట్టిన నిఖిత పోర్వాల్ కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. టైటిల్ గెలిచిన తర్వాత సోషల్ మీడియా వేదికగా ఉజ్జయినికి చెందిన నిఖిత తన ఆనందాన్ని వ్యక్తంచేశారు. " ఇప్పుడు నేను అనుభవిస్తోన్న ఆనందాన్ని వర్ణించలేను. ఇదంతా ఇప్పటికీ నమ్మలేకపోతున్నా.. కానీ నా తల్లిదండ్రుల కళ్లలోని ఆనందం చూసి గర్వంగా ఉంది. నా ప్రయాణం ఇప్పుడే మొదలైంది. ఇంకా నేను సాధించాల్సిన విజయాలు చాలా ఉన్నాయి" అని ఆమె సంతోషం వ్యక్తంచేశారు. గతేడాది మిస్ ఇండియాగా నిలిచిన నందినిగుప్తా విజేతకు కిరీటాన్ని అలంకరించారు. ఇక, రన్నరప్లు రేఖ స్వస్థలం దాద్రా అండ్ నగర్ హవేలీ కాగా.. ఆయుశీది గుజరాత్.

# వర్గీకరణ అంశంలో సీఎం ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదు: మందకృష్ణ మాదిగ

**మరో ఉద్యమానికి మాదిగ, ఉపకులాలు సిద్ధంగా ఉండాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు.**




హైదరాబాద్,అక్టోబర్ 17 (రిపబ్లిక్ న్యూస్) : మరో ఉద్యమానికి మాదిగ, ఉపకులాలు సిద్ధంగా ఉండాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. హైదరాబాద్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలుచేసే విషయంలో రాష్ట్రం ముందుంటుందని సీఎం అన్నారని గుర్తుచేశారు. కానీ అమలు విషయంలో జాప్యం చేస్తున్నారని చెప్పారు."ఎస్సీ వర్గీకరణ అమలులో ఎందుకు జాప్యం చేస్తున్నారు? మాదిగలపై రేవంత్వి తేనె పూసిన మాటలు. నమ్మించడంలో ఘనుడు.. మోసం చేయడంలో అంతకన్నా పెద్ద ఘనుడే. వర్గీకరణ అంశంపై సీఎం తాను ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. ఎస్సీ వర్గీకరణ విషయంలో పంజాబ్, తమిళనాడు తొలి వరసలో నిలిచాయి. ముందు అమలుచేస్తామన్న రేవంత్ మాటలకు విలువ లేకుండాపోయింది" అని మందకృష్ణ మాదిగ విమర్శించారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# శ్రీవారి మెట్టు మార్గాన్ని మూసివేసిన తితిదే

భారీవర్షాల నేపథ్యంలో వాతావరణ శాఖ హెచ్చరికలతో తితిదే ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. భక్తులకు ఇబ్బంది లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.



**తిరుమల, అక్టోబర్ 17 (రిపబ్లిక్ న్యూస్) :** భారీవర్షాల నేపథ్యంలో వాతావరణ శాఖ హెచ్చరికలతో తితిదే ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. భక్తులకు ఇబ్బంది లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. శ్రీవారి మెట్టు కాలినడక మార్గాన్ని తితిదే మూసివేసింది. కొండచరియలపై నిఘా ఉంచి ఘాట్ రోడ్లలో ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకుంటోంది. భక్తుల దర్శనాలు, వసతికి ఇబ్బంది కలగకుండా తితిదే ఏర్పాట్లు చేసింది. మరోవైపు వాయుగుండం తీరం దాటాక వర్షాలు లేకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

# ఏపీలో కొత్త మద్యం దుకాణాలు.. ఎవరికి కావాల్సిన బ్రాండ్ వారికి!

రాష్ట్రంలో కొత్త మద్యం దుకాణాలు బుధవారం నుంచి మొదలయ్యాయి. వాటిలో డిజిటల్ పేమెంట్స్ సౌకర్యం కూడా అందుబాటులోకి వచ్చింది.



**అక్టోబర్ 17 (రిపబ్లిక్ న్యూస్) :** రాష్ట్రంలో కొత్త మద్యం దుకాణాలు బుధవారం నుంచి మొదలయ్యాయి. వాటిలో డిజిటల్ పేమెంట్స్ సౌకర్యం కూడా అందుబాటులోకి వచ్చింది. వైకాపా హయాంలో ఊరుపేరు లేని మద్యం ముంచెత్తగా ఇప్పుడు బ్రాండెడ్ సరకు వచ్చింది. బుధవారం విజయవాడలోని బీఆర్ టీఎస్ రోడ్డులో కొత్తగా దుకాణం ప్రారంభం కాగానే అధిక సంఖ్యలో వచ్చిన కొనుగోలుదారులు సెల్ఫోన్తో డబ్బులు చెల్లించి నచ్చిన బ్రాండెడ్ సీసా తీసుకెళ్తూ కనిపించారు.

# ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన బైక్.. ముగ్గురి మృతి

వికారాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. పూడూరు గేటు వద్ద ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొట్టింది.

**పూడూరు, అక్టోబర్ 17 (రిపబ్లిక్ న్యూస్) :** వికారాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. పూడూరు గేటు వద్ద ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందారు. మృతులను పూడూరు మండలం మేడికొండకు చెందిన వారిగా గుర్తించారు.




# వెయ్యి కలశములతో రాఘవేంద్ర స్వామికి క్షీరాభిషేకం

## కర్నూలు జిల్లా మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి తమిళనాడు భక్తులు దాదాపు 1500 మంది చేరుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి పీఠాధిపతి సుబుదేంద్ర చేతుల మీదుగా దాదాపు వెయ్యి రాగి కలశములతో క్షీరాభిషేకం నిర్వహించారు.

**మంత్రాలయం, అక్టోబర్ 17 (రిపబ్లిక్ న్యూస్) :** మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి తమిళనాడు భక్తులు దాదాపు 1500 మంది చేరుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి పీఠాధిపతి సుబుదేంద్ర చేతుల మీదుగా దాదాపు వెయ్యి రాగి కలశములతో క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఊంజల మంటపంలో ఉత్సవమూర్తి ప్రహ్లాద రాయలకు విశేష పూజలు నిర్వహించారు. మంత్రాలయంలో భక్తుల సందడి మంత్రాలయంలో భక్తుల సందడిరాఘవేంద్ర స్వామి దర్శనార్థం దేశం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు మంత్రాలయం చేరుకున్నారు. గురువారం రాఘవేంద్ర స్వామికి అత్యంత ఇష్టమైన వారం కావడంతో కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర, కేరళ తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు మంత్రాలయం చేరుకున్నారు. తుంగభద్ర నదిలో పవిత్ర స్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు భక్తులకు ఫలమంత్ర అక్షింతలు ఇచ్చి ఆశీర్వదించారు. వేలాది మంది భక్తులతో మంత్రాలయం ప్రధానవీధులు, మధ్వ కారిడార్ తుంగభద్ర నది తీరం శ్రీమఠం ప్రకారంలో భక్తులతో కిటకిటలాడింది.



# విశాఖ, కాకినాడ తీరాల్లో భారీగా ఎగసిపడుతున్న అలలు

## వాయుగుండం ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

వాయుగుండం ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాయలసీమ జిల్లాలతో పాటు ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, తూర్పుగోదావరి, విశాఖ జిల్లాల్లో కొన్నిచోట్ల జనజీవనం స్తంభించింది. విశాఖపట్నం, కాకినాడ తీరాల్లో పెద్ద ఎత్తున సముద్రపు అలలు ఎగసిపడుతున్నాయి. విశాఖలోని ఆర్కే బీచ్ వద్ద అలలు దుకాణాలను తాకుతున్నాయి. వర్షానికి పెదగంట్యాడ మండలం కొంగపాలెంలో రేకుల షెడ్డు కూలింది. దీంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి.కాకినాడ జిల్లాలోని యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. భారీగా రాకాసి అలలు ఎగసిపడుతున్నాయి. చెట్లు, విద్యుత్, స్తంభాలు, ఇళ్లు నేల కూలాయి. అంతర్వేది తీరంలో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. గోదావరి సంగమం వద్ద అలలు ఎగసిపడుతున్నాయి. పల్లిపాలెంలో ఇళ్లు, బీచ్ రోడ్డును అలలు ముంచెత్తాయి. డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అల్లవరం మండలం ఓడలరేవు తీరంలో అలలు ఉధృతంగా ఎగసిపడుతున్నాయి. ఓఎన్జీసీ ప్లాంటును సముద్రపు నీరు తాకింది. ఆక్వా చెరువులను సముద్రం నీరు ముంచెత్తింది.



# హైదరాబాద్లో పలుచోట్ల ఐటీ సోదాలు

## నగరంలో పలుచోట్ల ఆదాయపన్ను శాఖ అధికారులు సోదాలు చేపట్టారు.

**హైదరాబాద్, అక్టోబర్ 17 (రిపబ్లిక్ న్యూస్) :** నగరంలో పలుచోట్ల ఆదాయపన్నుశాఖ అధికారులు సోదాలు చేపట్టారు. అన్వితగ్రూపు కార్యాలయాల్లో తనిఖీలు చేస్తున్నారు. పలు దస్త్రాలను వారు పరిశీలిస్తున్నారు. సంస్థడైరెక్టర్ల ఇళ్లలోనూ సోదాలు కొనసాగుతున్నాయి. జూబ్లీహిల్స్, రాయదుర్గం, కొల్లూరు, సంగారెడ్డిలోఆదాయపన్నుశాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నారు.




# సిరిసిల్లలో వైభవంగా బ్రహ్మోత్సవాలు.. నేడు రథోత్సవం

పట్టణంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అత్యంత కీలక ఘట్టమైన రథోత్సవం నేడు జరగనుంది.



**సిరిసిల్ల, అక్టోబర్ 17 (రిపబ్లిక్ న్యూస్) :** పట్టణంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అత్యంత కీలక ఘట్టమైన రథోత్సవం నేడు జరగనుంది. వేకువజామున 4 గంటలకు ఉభయ దేవేరులు, గోదాదేవి సమేతంగా స్వామివారిని రథంపైకి చేర్చారు. అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి దర్శనం చేసుకుంటున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఆలయం చుట్టూ ఉన్న పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తారు. దీన్ని వీక్షించేందుకు సుమారు 50వేల మంది హాజరవుతారని అంచనా. ఊరేగింపు తర్వాత రాత్రి వరకు రథంపై దర్శనాలు కొనసాగనున్నాయి.

# ఏపీ సీఎస్కు రిపోర్టు చేసిన నలుగురు ఐఏఎస్ అధికారులు

## డీవోపీటీ ఆదేశాల మేరకు నలుగురు ఐఏఎస్ అధికారులు ఏపీలో రిపోర్టు చేశారు.

**అమరావతి, అక్టోబర్ 17 (రిపబ్లిక్ న్యూస్) :** డీవోపీటీ ఆదేశాల మేరకు నలుగురు ఐఏఎస్ అధికారులు ఏపీలో రిపోర్టు చేశారు. ఏపీ సీఎస్ నీరబ్కుమార్ ప్రసాద్ను ఆమ్రపాలి, రోనాల్డ్ రోస్, వాకాటి కరుణ, వాణీ ప్రసాద్ కలిశారు. బుధవారం సాయంత్రం తెలంగాణ నుంచి ఈ నలుగురు అధికారులూ రిలీవ్ అయ్యారు. డీవోపీటీఆదేశాలపైజోక్యం చేసుకునేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించడంతో వీరు ఏపీకి వచ్చి రిపోర్టుచేశారు.



# ఆ సమయంలో తీవ్ర ఆందోళనకు గురయ్యా: షారుక్ ఖాన్

*తన హిట్ చిత్రం 'దేవదాస్' రోజులను షారుక్ తాజాగా గుర్తుచేసుకున్నారు. ఆ సినిమా సమయంలో ఎంతో ఆందోళనకు గురైనట్లు తెలిపారు.*



వరుస సినిమాలతో భాషతో సంబంధంలేకుండా అభిమానులను అలరిస్తుంటారు స్టార్ హీరో షారుక్ ఖాన్ తాజాగా ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తన హిట్ చిత్రం 'దేవదాస్' షూటింగ్ రోజులను గుర్తుచేసుకున్నారు. అలాగే తాను మంచి చిత్రాలను చేస్తే.. తన తల్లిదండ్రులు స్వర్గం నుంచి చూసి ఆనందిస్తారన్న నమ్మకం ఉందన్నారు.సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కిన 'దేవదాస్' 2002లో విడుదలై మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. షారుక్ కెరీర్లో బిగ్గెస్ట్ హిట్ చిత్రాల లిస్టో చేరింది. అయితే ఆ సినిమా సమయంలో షారుక్ తీవ్ర ఆందోళనకు గురయ్యారట. ఈ విషయం గురించి ఆయన మాట్లాడుతూ.. "నేను దేవదాస్ సినిమాను మా అమ్మ కోసం అంగీకరించాను. ఆ చిత్రంలో నా నటన చూసి ఆమె గర్వపడాలనుకున్నా. గతంలో దిలీప్ కుమార్, కెఎల్ సైగల్ వంటి ఎంతోమంది గొప్పనటులు ఆ పాత్రను పోషించారు. వారిలా నేను నటించలేనని చాలా మంది ఆ సినిమాను అంగీకరించొద్దని సలహా ఇచ్చారు. కానీ, నేను ఆ ప్రాజెక్టో నటించాల్సిందేనని నిర్ణయించుకున్నా. 'దేవదాస్' పూర్తయ్యాక సంజయ్ లీలా భన్సాలీ నాపై ప్రశంసలు కురిపించారు. అలాగే ఆ సినిమా విడుదల సమయంలో ఆందోళనకు గురయ్యాను. మద్యం అలవాటు చేసుకున్నా. బహుశ ఆ అలవాటే నాకు ఉత్తమ నటుడిగా అవార్డును తెచ్చిందేమో" అని షారుక్ సరదాగా చెప్పారు. 'దేవదాస్'లో ఐశ్వర్యా రాయ్, మాధురీ దీక్షిత్లు నటించిన సంగతి తెలిసిందే.షారుక్ కెరీర్ ప్రారంభించడాని కంటే ముందే ఆయన తల్లిదండ్రులు కన్నుమూశారు. ఈ విషయంలో ఆయన అనేక సందర్భాల్లో ఆవేదన చెందారు. తన సక్సెస్ను తల్లిదండ్రులు చూడలేదని, వారు ప్రాణాలతో ఉండుంటే చాలా సంతోషించే వారని అన్నారు. మంచి పాత్రలు ఎంచుకుంటే ఇప్పటికీ వారు స్వర్గం నుంచి చూసి ఆనందిస్తారనే నమ్మకం ఉందన్నారు. ప్రస్తుతం ఈ బాదీ 'కింగ్'లో నటిస్తున్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

## కొండా సురేఖ వ్యాఖ్యలపై మరోసారి స్పందించిన సమంత..

**కొండా సురేఖ వ్యాఖ్యలపై సమంత మరోసారి స్పందించారు. ఇండస్ట్రీకి చెందిన ఎంతోమంది ప్రముఖులు తనకు ధైర్యాన్నిచ్చినట్లు తెలిపారు.**



మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై సమంత మరోసారి స్పందించారు. తన వెబ్ సిరీస్ 'సిటాడెల్: హనీ బన్నీ' ప్రమోషన్లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో దీని గురించి మాట్లాడారు. ఇటీవల చర్చనీయాంశమైన కొండా సురేఖ వ్యాఖ్యల గురించి రిపోర్టర్ అడగ్గా.. సమంత ఈవిధంగా స్పందించారు. 'ఈరోజు ఇక్కడ కూర్చోవడానికి ఎంతోమంది మద్దతు కారణం. ఇండస్ట్రీకి చెందిన ప్రముఖుల ప్రేమ, నాపై వారికి ఉన్న నమ్మకమే నన్ను ఈ స్థాయిలో నిలబెట్టింది. వారు నాలో ధైర్యం నింపారు. కష్టాలను ఎదుర్కోవడంలో వారి మద్దతు నాకెంతో సాయపడింది. వారు నా పక్షాన నిలవకపోతే కొన్ని పరిస్థితులను అధిగమించేందుకు చాలా సమయం పట్టేది. నా చుట్టూ ఉన్నవారి నమ్మకం వల్లే సమస్యలను ఎదుర్కోగలిగాను' అని అన్నారు.ఆన్లైన్ ట్రోలింగ్లపై సమంత స్పందిస్తూ.. అలాంటి వాటి గురించి ఎక్కువ ఆలోచించను అని అన్నారు. 'ద్వేషపూరిత సందేశాలను కరించినప్పుడు వాటి ప్రభావం నాపై పడకుండా చూసుకుంటాను. దాన్ని పంపిన వారు కూడా అలాంటి బాధనే అనుభవించారేమో అని ఆలోచిస్తాను' అని తెలిపారు.ఇక తన అనారోగ్య కారణం వల్ల సిటాడెల్: హనీ బన్నీ'ను తిరస్కరించాలని భావించినట్లు సమంత చెప్పారు. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సిరీస్లో ఆమె స్పై ఏజెంట్గా నటించారు. దీని గురించి మాట్లాడుతూ.. "దర్శకులు నన్ను ఈ సిరీస్ కోసం సంప్రదించగానే నేను చేయలేనని చెప్పాను. ఈ పాత్రను చేయగలనని నిజంగా అనుకోలేదు. దానికి సరిపోయే నలుగురు హీరోయిన్ల పేర్లను కూడా రాజ్ అండ్ డీకే కు సిఫార్సు చేశాను. వాళ్లు అయితే ఈ పాత్రకు కచ్చితంగా న్యాయం చేయగలరని చెప్పాను. నేను చేయలేనని వేడుకున్నా. అయినా వాళ్లు పట్టుబట్టి నాకోసం వేచిచూశారు. ఇప్పుడు సిరీస్ పూర్తయ్యాక ఇంత గొప్ప పాత్ర ఇచ్చిన దర్శకులకు థ్యాంక్స్ చెప్పాను. మరొకరిని తీసుకోకుండా నాతో చేయడం నా అదృష్టంగా భావించా" అని చెప్పారు.రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో తెరకెక్కిన 'సిటాడెల్: హనీ బన్నీ'లో సమంత, వరుణ్ ధావన్లు ప్రధానపాత్రల్లో నటించారు. నవంబర్ 7 నుంచి అమెజాన్ ప్రైమ్ వేదికగా ఈ సిరీస్ అందుబాటులో ఉండనుంది. ఇందులో క్లైమాక్స్ సన్నివేశం హైలైట్ కానుందని సమంత అన్నారు. 11 నిమిషాల ఇంటెన్స్ యాక్షన్ సన్నివేశాన్ని సింగిల్ టేక్లో ఎలాంటి కట్స్ లేకుండా చిత్రీకరించినట్లు తెలిపారు.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1817 :** భారతీయ విద్యావేత్త, ఇస్లామీయ సామాజిక సంస్కర్త సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ జననం (మ.1898).(చిత్రంలో)
- **1920 :** భారతీయ కమ్యూనిస్టు పార్టీ తాష్కెంట్ లో ఏర్పడింది.
- **1901 :** భారత స్వాతంత్ర్య సమరయోధుడు, వైద్యుడు జి.ఎస్.మేల్కోటే జననం (మ.1982).
- **1929 :** కవి, పరిశోధకుడు, విమర్శకుడు కొర్లపాటి శ్రీరామమూర్తి జననం (మ.2011).
- **1940 :** గాంధీజీ పిలుపుతో వినోబా భావే 'వ్యక్తి సత్యాగ్రహా'న్ని ఆచరించిన రోజు.
- **1970 :** భారత క్రికెట్ క్రీడాకారుడు అనిల్ కుంబ్లే జననం.
- **1981 :** తమిళ కవి, భావకవి కన్నదాసన్ మరణం (జ.1927).
- **1979 :** మదర్ థెరీసా కు నోబెల్ శాంతి బహుమతి వచ్చింది.


సయ్యద్ అహ్మద్


తాష్కెంట్


జి.ఎస్.మేల్కోటే


శ్రీరామమూర్తి


వినోబా


అనిల్ కుంబ్లే


కన్నదాసన్


మదర్ థెరీసా

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

## కోహ్లికి కలిసిరాని వన్డేన్.. ఎనిమిదేళ్ల తర్వాత బరిలోకి దిగిన స్టార్ బ్యాటర్

**విరాట్ కోహ్లి చాన్నాళ్ల తర్వాత వన్డేన్లో బ్యాటింగ్కు దిగాడు. కానీ, బెంగళూరు మైదానంలో మాత్రం తేలిపోయాడు. కనీసం పరుగుల ఖాతా కూడా తెరవలేదు.**



భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి న్యూజిలాండ్ తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్ లో డకౌటై వెనుదిరిగాడు. తొమ్మిది బంతులు ఎదుర్కొన్నా పరుగుల ఖాతా మాత్రం తెరవలేదు. విలియమ్ ఓరూర్కీ బౌలింగ్లో గ్లెన్ ఫిలిప్స్ అద్భుతమైన క్యాచ్ పట్టడంతో కోహ్లి పెవిలియన్కు చేరాడు. ఎక్కువగా సెకండ్ డౌన్లో బ్యాటింగ్కు వచ్చే విరాట్ కోహ్లి యువ బ్యాటర్ శుభ్మన్ గిల్ గైర్హాజరీతో ఈసారి ముందొచ్చాడు. కానీ, అతడికి మరోసారి వన్ డౌన్ కలిసిరాలేదు. చివరిసారిగా 2016లో వెస్టిండీస్పై వన్డేన్లో బ్యాటింగ్కు వచ్చాడు. కానీ, ఆ మ్యాచ్లో రెండు ఇన్నింగ్స్ ల్లోనూ 3, 4 పరుగులు మాత్రమే చేశాడు. ఇప్పటివరకు టెస్టుల్లో అతడు నాలుగు టెస్టుల్లోనే ఈ ప్లేస్లో బ్యాటింగ్ చేశాడు. కనీసం ఒక్క హాఫ్ సెంచరీ కూడా నమోదు చేయలేదు. ఆరు ఇన్నింగ్స్ ల్లో 97 పరుగులు సాధించాడు. అత్యధికం 41 పరుగులు మాత్రమే.టీమ్ ఇండియా తరఫున అత్యధిక మ్యాచులు ఆడిన రెండో ఆటగాడిగా విరాట్ కోహ్లి నిలిచాడు. తుది జట్టులో స్థానం సంపాదించిన జాబితాలో సచిన్ అందరికంటే ఎక్కువగా ఉన్నాడు. సచిన్ 664 మ్యాచులు ఆడగా.. విరాట్ కోహ్లి 536తో రెండో స్థానంలో ఉన్నాడు. ఇప్పటివరకు ఎంఎస్ ధోనీతో (535) కలిసి సంయుక్తంగా ఉండేవాడు. రాహుల్ ద్రావిడ్ (504) నాలుగు, ప్రస్తుత భారత కెప్టెన్ రోహిత్ శర్మ (486) ఐదో స్థానాల్లో ఉన్నారు.తొలి ఇన్నింగ్స్ లో కేవలం 9 బంతులను మాత్రమే ఎదుర్కొన్న కోహ్లి ఒక్క పరుగు కూడా చేయలేదు. ఈ క్రమంలో ఓ చెత్త రికార్డును కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. అంతర్జాతీయంగా విరాటికిది 38వ డక్. ప్రస్తుతం ఆడుతున్న క్రికెటర్లలో టిమ్ సౌథీ (38)తో సమంగా నిలిచాడు. వీరిద్దరి తర్వాత రోహిత్ శర్మ (33) ఉన్నాడు. అన్నిఫార్మాట్లు కలిపి ఓవరాల్గా ముత్తయ్య మురళీ ధరన్ (59) అందరికంటే ముందున్నాడు.పిచ్ పేస్ బౌలింగ్కు అనుకూలంగా ఉండటంతో పరుగుల కోసం భారత బ్యాటర్లు తీవ్రంగా శ్రమించాల్సివస్తోంది. కివీస్ బౌలర్ల దెబ్బకు టీమ్ ఇండియా స్వల్ప వ్యవధిలో మూడు కీలక వికెట్లను కోల్పోయింది. రోహిత్ శర్మ(2) విఫలం కాగా.. విరాట్ కోహ్లి (0), సర్ఫరాజ్ ఖాన్ (0) పరుగుల ఖాతా తెరవలేదు. చాలారోజుల తర్వాత తుది జట్టులో అవకాశం దక్కించుకున్న సర్ఫరాజ్ ఖాన్ దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించాడు. అయితే, కివీస్ ఆటగాళ్లు అద్భుతంగా ఫీల్డింగ్ చేస్తున్నారు. భారత ఇన్నింగ్స్ 13వ ఓవర్ జరుగుతున్నప్పుడు వర్షం రావడంతో ఆటను నిలిపేశారు. టీమిండియా స్కోరు 12.4 ఓవర్లకు 3 వికెట్ల నష్టానికి 13 పరుగులు. క్రీజ్లో రిషబ్ పంత్ (3లి), యశస్వి జైస్వాల్ (8లి) ఉన్నారు. కివీస్ బౌలర్లు సౌథీ, హెన్రీ, రూర్కీ తలో వికెట్ పడగొట్టారు.


## ఆరోగ్యం

**కాలేయం మానవ శరీరంలో ఎంతో ముఖ్యమైన పండుగల సీజన్ కొనసాగుతోంది. త్వరలో దీపావళి పండుగ కూడా రాబోతోంది. దీపావళికి వివిధ రకాల పిండి వంటలు, స్వీట్లు ఇంట్లో తయారు చేసుకుంటారు. ఇక, దీపావళికి చాలా మంది బహుమతులు ఇస్తూ ఉంటారు. ఇదో సంప్రదాయం. ఇక, చాలా మంది బాదం పప్పుల్ని గిఫ్ట్గా ఇస్తుంటారు. లేదంటే బాదం పప్పులతో చేసిన స్వీట్స్ బంధువులకు పంపుతుంటారు. దీంతో.. దీపావళికి బాదం పప్పుకి డిమాండ్ ఎక్కువ ఉ ంటుంది. అంతేకాకుండా బాదం పప్పుతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. బాదం పప్పులు గుండెకు మేలు చేస్తాయి. వీటిలో ఎన్నో పోషకాలు ఉన్నాయి. బాదం పప్పులో ఉండే కాల్షియం, ఫాస్పరస్ ఎముకల బలానికి ఉపయోగపడతాయి. బాదం పప్పులు తింటే జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. షుగర్ లెవల్స్ కంట్రోల్లో ఉంచడానికి బాదం పప్పులు బాగా సహకరిస్తాయి. ఇలా చెప్పుకుంటే పోతే ఎన్నో లాభాలు ఉన్నాయి.అయితే, మార్కెట్లో ఉన్న డిమాండ్ కారణంగా నకిలీ బాదం పప్పును అమ్ముతున్నారు కొందరు వ్యాపారులు. నకిలీ బాదం పప్పుతో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. వ్యవస్థాపకుడు, సంపూర్ణ పోషకాహార నిపుణుడు ప్రియాంషి భట్నాగర్ ప్రకారం.. వ్యాపారులు హైడ్రోజన్ పెరాక్సైడ్, బ్లీచింగ్ ఏజెంట్లు వంటి హానికరమైన రసాయనాలను బాదం పప్పులో వాడుతున్నారు. వీటిని బాదంపప్పు రంగు పెరగడానికి వాడుతున్నారు. ఈ కల్తీ బాదంపప్పులను తీసుకోవడం వల్ల తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. అందుకే నకిలీ బాదం పప్పుల్ని ఎలా గుర్తించాలో ఇక్కడ తెలుసుకుందాం.**

## తక్కువ ధరకే ఇంటికి క్యాన్సర్.. విషపూరితమైన బాదం పప్పుల్ని ఇలా కనిపెట్టండి..



### బాదంపప్పులో ప్రమాదకర రసాయనాలు..వ్యాయామం..



పండగ సీజన్లో బాదం, ఇతర డ్రై ఫ్రూట్స్కు డిమాండ్ పెరుగుతుంది. వ్యాపారులు ఎక్కువ లాభాలు పొందేందుకు బాదంపప్పును కల్తీ చేస్తారు. బాదంపప్పులను మరింత మెరిసేలా, ఆకర్షణీయంగా మార్చిన తర్వాత విక్రయిస్తారు. దీనికి వాడే రసాయనాలు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. హైడ్రోజన్ పెరాక్సైడ్, బ్లీచింగ్ రసాయనాలు.. కడుపు సమస్యలు, అలెర్జీలు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి.

### క్యాన్సర్...



కల్తీ బాదం పప్పులను ఎక్కువ కాలం తినడం వల్ల శరీరంలో విష పదార్థాలు చేరుకుంటాయి. వీటిలో ఉండే రసాయనాలు కాలేయం, మూత్రపిండాలను దెబ్బతీస్తాయి. శరీరంలోని హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తాయి. కొన్ని బ్లీచింగ్ ఏజెంట్లు శరీరంలో క్యాన్సర్ను కూడా కలిగిస్తాయి. అందుకే నకిలీ బాదం పప్పుల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.

### రోగనిరోధక శక్తి తగ్గుతుంది..

విషపూరితమైన బాదంపప్పులు తినడం వల్ల.. వాటిలో ఉండే రసాయనాల వల్ల అలర్జీలు వచ్చే అవకాశం ఉంది. దీంతో దురద, దద్దుర్లు వంటి తేలికపాటి లక్షణాల నుంచి అనాఫిలాక్సిస్ వంటి తీవ్రమైన పరిస్థితులకు గురవుతారు. ఇది మాత్రమే కాదు.. నకిలీ బాదం పప్పులు తింటే రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. దీంతో.. మీరు సులభంగా ఇన్ఫెక్షన్లు, వ్యాధుల బారిన పడతారు



### నకిలీ బాదం పప్పులకు ఇలా చెక్ పెట్టండి..



- బాదం నిజమో, నకిలీదో చెక్ చేయడానికి నీటిని వాడుకోవచ్చు.
- కొన్ని బాదంపప్పులను తీసుకుని శుభ్రమైన గిన్నెలో లేదా కంటైనర్లో ఉంచండి. గిన్నె శుభ్రంగా ఉండాలని గుర్తించుకోండి.
- గిన్నెలో బాదం పూర్తిగా మునిగిపోయేలా తగినంత నీరు కలపండి. వాటిని రాత్రంతా నాననివ్వండి.
- మరుసటి రోజు ఉదయం, బాదంపప్పును నీటిలో నుంచి తీసి.. వాటి తొక్క తీయండి.సహజ బాదంపప్పుల పొట్టు తేలికగా వస్తుంది. తొక్క తీసిన తర్వాత బాదం పప్పు తెల్లగా ఉంటుంది.
- నీరు గోధుమ రంగులోకి మారితే బాదంపప్పులో రసాయనాలు వాడినట్లు అర్థం.
- అదే నకిలీ బాదం పప్పుల తొక్క మాత్రం సులువుగా రాదు. చాలా కష్టంగా వస్తుంది. అంతేకాకుండా నీటి రంగును తనిఖీ చేయండి. నీటి రంగు శుభ్రంగా ఉంటే బాదం పప్పు మంచిదని అర్థం చేసుకోవచ్చు.

### నకిలీ బాదం పప్పుతో వచ్చే ప్రమాదాలు ఇవే..



జీర్ణవ్యవస్థ పాడు అవుతుంది..హైడ్రోజన్ పెరాక్సైడ్ వంటి రసాయనాలు కడుపు, ప్రేగుల లైనింగ్ను చికాకుపరుసాయి. దీంతో కడుపు నొప్పి, వికారం, వాంతులు విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. నకిలీ బాదం పప్పులతో జీవక్రియకి బ్రేకులు పడతాయి. దీంతో.. జీర్ణవ్యవస్థ అస్తవ్యస్తం అవుతుంది. ఇలాంటి బాదంపప్పును ఎక్కువ కాలం తినడం వల్ల తీవ్రమైన జీర్ణ రుగ్మతలు వస్తాయి.

### నీటి పరీక్ష ఎందుకు ప్రభావవంతంగా ఉంటుంది?



హైడ్రోజన్ పెరాక్సైడ్ తరచుగా బ్లీచింగ్ కోసం ఉపయోగిస్తారు. హైడ్రోజన్ పెరాక్సైడ్ నీటితో చర్య జరుపుతుంది. అందుకే కల్తీ బాదంపప్పును నానబెట్టినప్పుడు నీరు గోధుమరంగు లేదా కొద్దిగా పసుపు రంగులోకి మారవచ్చు. బ్లీచింగ్ ఏజెంట్లు నీటితో చర్యలు జరిపినప్పుడు.. అవి అవిశేషాలను వదులుతాయి. దీంతో.. నీటి రంగు మారుతుంది. నీటి రంగు మారిందంటే బాదం పప్పు కల్తీ జరిగిదనడానికి స్పష్టమైన సంకేతం. స్వచ్ఛమైన బాదంపప్పులో సహజ నూనెలు ఉంటాయి. ఇవి నీటి రంగును మార్చవు.

గమనిక..ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం.